క్లుప్తంగా

నేడు గడప గడపకు..

సత్యవేడు: మండల కేంద్రంలోని సచివాలయం–3 పరిధిలో సోమవారం ఉదయం 9 గంటల నుంచి గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ కె.సుశీల్‌కుమార్ రెడ్డి తెలిపారు. ఆయా గ్రామాల్లో ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పర్యటిస్తారన్నారు. మండల అధికారులు, పార్టీ నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధులు, వలంటీర్లు హాజరుకావాలని కోరారు.

పచ్చాలమ్మకు ప్రత్యేక పూజలు



అమ్మవారికి పూజలు చేస్తున్న అర్చకుడు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పల్లమాల పంచాయతీ పచ్చాలమ్మ కాలనీలో వెలసిన పచ్చాలమ్మకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని వివిధ రకాల పుష్పాలతో సుందరంగా అలంకరించారు. గ్రామస్తులు అమ్మవారికి పొంగళ్లు పెట్టి నైవేద్యం సమర్పించారు. చుట్టు పక్కల గ్రామాల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి అమ్మవారిని దర్శించుకున్నారు.

బదిలీ పోలీసులకు సత్కారం



సత్కరిస్తున్న సీఐ, ఎస్‌ఐ

బుచ్చినాయుడుకండ్రిగ: మండల కేంద్రంలోని పోలీస్‌స్టేషన్‌లో పనిచేస్తూ ఇటీవల బదిలీ అయిన హెడ్ కానిస్టేబుల్ మధు, కానిస్టేబుల్ ప్రసన్నను సీఐ విక్రమ్, ఎస్‌ఐ మంజునాథరెడ్డి ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా సీఐ విక్రమ్ మాట్లాడుతూ.. మధు, ప్రసన్న నిబద్ధతతో విధులు నిర్వహించి ప్రజల మన్ననలు పొందారని కొనియాడారు.

చేతి పంపునకు ప్లాట్‌ఫాం ఏర్పాటు చేయరూ



ప్లాట్‌ఫాం లేని చేతిపంపు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పెద్దపాలేడు గ్రామంలో తాగునీటి చేతిపంపునకు ప్లాట్‌ఫాం లేకపోవడంతో గ్రామస్తులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఈ కారణంగా పంపు చుట్టూ మురుగునీరు చేరడంతో దోమలు వృద్ధి చెందుతున్నాయి. దుర్గంధం వ్యాపిస్తోంది. చేతిపంపు నుంచి నీటిని తెచ్చుకోవడానికి ఇబ్బందిగా మారింది. అధికారులు స్పందించి తాగునీటి చేతిపంపునకు ప్లాట్‌ఫాం ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరుతున్నారు.

విద్యార్థులకు దుస్తులు పంపిణీ



విద్యార్థులకు దుస్తులు అందజేస్తున్న మునిశేఖర్

ఏర్పేడు: మండలంలోని చిందేపల్లి ఎస్టీ కాలనీలో యువనేస్తం అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం విద్యార్థులకు దుస్తులు, విద్యా సామగ్రి అందజేశారు. కాలనీలోని 19 మంది విద్యార్థులకు అందజేసి మానవత్వాన్ని చాటుకున్నారు. కార్యక్రమంలో యువనేస్తం అసోసియేషన్ వ్యవస్థాపకుడు మునిశేఖర్, అరుణ, నాగమణి పాల్గొన్నారు.

ఘాట్ రోడ్‌లో అదుపు తప్పిన కారు



అదుపు తప్పిన కారు

తిరుమల: మొదటి ఘాట్ రోడ్‌లో ఆదివారం కారు అదుపుతప్పింది. శ్రీకాకుళానికి చెందిన భక్తులు శ్రీవారి దర్శనం చేసుకుని తిరిగి ప్రయాణమయ్యారు. మొదటి ఘాట్ రోడ్ అలిపిరి సమీపంలో వాహనం అదుపుతప్పి పక్కన ఉన్న పిట్టగోడను ఢీకొంది. ఈ ప్రమాదంలో శ్రీకాకుళం చెందిన పద్మకు చిన్నపాటి గాయాలయ్యాయి. ఘాట్ రోడ్ సిబ్బంది వాహనాన్ని పక్కకు తొలగించి ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరించారు.

బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు తయారు చేసిన కళాకృతులు



వ్యర్థానికి అర్థం.. సృజనే పరమార్థం

"విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనకు పదునుపెట్టాలే గానీ ఇసుక రేణువుల నుంచి తైలాన్ని తీయగల సత్తా తమలో ఉందంటున్నారు రేణిగుంట బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు. నిత్య జీవితంలో మనం వాడిపడేసే వ్యర్థ పదార్థాలను సేకరించి వాటితో బొమ్మలను తయారు చేసి ప్రాణం పోసిన సృజన వారిని రాష్ట్రస్థాయి పోటీల వరకు నడిపించింది.''

- వ్యర్థాలతో ఆకట్టుకునే బొమ్మల తయారీ
- రేణిగుంట బాలికోన్నత పాఠశాల విద్యార్థినుల ప్రతిభ
- వివిధ రాష్ట్రాలకు చెందిన బృందాల నుంచి ప్రశంసలు



బాలికోన్నత పాఠశాల విద్యార్థినులు తయారు చేసిన బొమ్మలు

రేణిగుంట: రేణిగుంట జెడ్పీ బాలికోన్నత పాఠశాలలో ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ విద్యను 2013లో నుంచి ప్రత్యేకంగా నడుపుతున్నారు. ఇక్కడ క్రాఫ్ట్ టీచర్ విద్యార్థినుల్లో దాగి ఉన్న సహజ సామర్థ్యాలకు పదును పెడుతూ ఆరో తరగతి నుంచి 9వ తరగతి వరకు విద్యార్థులకు ప్రతి రోజు ప్రత్యేక తర్ఫీదునిస్తున్నారు.

విద్యార్థులకు మెలకువలు

వాడి పడేసే ఐస్‌క్రీమ్ పుల్లలు, టీ కప్పులు, ప్లాస్టిక్ స్పూన్లు, కూల్‌డ్రింక్ తాగే పుల్లలు, కర్ర పుల్లలు, వాటర్ బాటిళ్లతో వివిధ రకాల బొమ్మలను తయారు చేసి వాటిని పెయింటింగ్‌తో అందమైన హస్త కళల ఉత్పత్తులుగా రూపొందిస్తున్నారు. ఆసక్తి ఉన్న పిల్లలందరికి ఇలాంటి కుట్లు, అల్లికలు, బొమ్మల తయారీ, పెయింటింగ్ విధానాన్ని మెలకువలతో నేర్పుతున్నారు. విద్యార్థులు ప్రత్యేక శ్రద్ధ వహించి వ్యర్థ పదార్థాలను ఉపయోగించి బొమ్మలను తయారు చేసి



ప్రదర్శిస్తున్న విద్యార్థినులు

పాఠశాల తరగతి గదుల్లో ప్రదర్శిస్తున్నారు.

ప్రశంసలు

ఇటీవల న్యూఢిల్లీ, ఉత్తరాఖండ్ రాష్ట్రాల నుంచి ఆయా రాష్ట్రాల ఎస్‌సీఈఆర్‌టీలతో ప్రత్యే బృందాలు ఈ స్కూల్‌ను సందర్శించి ఇక్కడ అమలవుతున్న విద్యావిధానం, ప్రభుత్వ పాఠశాల వసతులు, పథకాల గురించి తెలుసుకున్నారు. ఆ సందర్భంలో వారిని ఈ పాఠశాలలో విద్యార్థులు రూపొందించిన ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ బొమ్మలు విశేషంగా ఆకట్టుకున్నాయి. మనం వాడి పారేసే వస్తువులతో చూడచక్కని రీతిలో బొమ్మలు తయారు చేయడంపై విద్యార్థులలో దాగి ఉన్న సృజనాత్మకతను వారు ప్రశంసించారు.



ఢిల్లీకి చెందిన బృందం పరిశీలన

ఎంతో సంతోషకరం

మా పాఠశాలలో పనిచేస్తున్న క్రాఫ్ట్ టీచర్ జె.ప్రమీల గైడెన్స్‌తో విద్యార్థినులు ఉపయోగం లేని వస్తువులను వినియోగించి సుందరమైన బొమ్మలుగా తీర్చిదిద్దుతున్నారు. ఇటీవల ఢిల్లీ, ఉత్తరఖాండ్ నుంచి వచ్చిన ప్రత్యేక బృందాలు విద్యార్థుల ప్రతిభను గుర్తించి ప్రశంసించడం ఆనందంగా ఉంది. కేవలం విద్యాభ్యాసానికే పరిమితం కాకుండా అభ్యాసేతర కార్యక్రమాల్లోనూ పిల్లలు ప్రావీణ్యం సంపాదించడం సంతోషంగా ఉంది.

– విష్ణువర్థనం, హెచ్‌ఎం, బాలికోన్నత పాఠశాల, రేణిగుట

వేడుకగా మహాకుంభాభిషేకం



వేదపండితులను సన్మానిస్తున్న అంజూరు శ్రీనివాసులు

తొట్టంబేడు(శ్రీకాళహస్తి): తొట్టంబేడు మండలం నెల్లిమానుకండ్రిగ గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీచండికా పరమేశ్వరి సమేత శ్రీచక్రేశ్వర స్వామి ఆలయ మహాకుంభాభిషేకం ఆదివారం వేదోక్తంగా నిర్వహించారు. శ్రీచండికాంబిక పీఠం ట్రస్టు వ్యవస్థాపకులు సింగరాజు ప్రకాశం దంపతుల ఆధ్వర్యంలో సింగరాజ మణికంగ శర్మ సారథ్యంలో వేదపండితులు మాహాకుంభాభిషేకం పూజా కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. మంగళవాయిద్యాల నడుమ ప్రధాన కలశాలను ఊరేగింపుగా ఆలయ శిఖరం పైకి తీసుకెళ్లి కలశాభిషేకం చేశారు. అనంతరం ఆలయంలో విశేష పూజలు చేశారు. ధూప, దీప నైవేద్యాలు సమర్పించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామి అమ్మవార్లను దర్శించుకున్నారు. ఆర్డీఓ రామారావు, శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు, ప్రముఖులు స్వర్ణమూర్తి, కోళ్లూరు హరినాథ్‌నాయుడు, సురేష్‌బాబు, రాము గుప్తా, మురళిగుప్తా, భూలక్ష్మమ్మ, బాలగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారిని దర్శించుకున్న బియ్యపు పవిత్రారెడ్డి

మహాకుంభాభిషేక పూజల్లో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి కుమార్తె, వైఎస్సార్‌సీపీ



కలశ తీర్థాలను తీసుకెళుతున్న అర్చకులు



అమ్మవారిని దర్శించుకుంటున్న పవిత్రారెడ్డి

తొట్టంబేడు మండలం ఇన్‌చార్జి బియ్యపు పవిత్రారెడ్డి పాల్గొన్నారు. అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు. ఆలయ అర్చకులు ఆమెకు తీర్థప్రసాదాలు అందజేశారు. సర్పంచ్ రాజ్ ప్రకాష్, గిరి, మోహన్, సురేష్ తదితరులు ఉన్నారు.

తిరుమలేశుని సేవలో దేవప్రసాద్‌దాస్ స్వామి



ఆలయం వెలుపల స్వామిజీ, ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామిని ఆదివారం శ్రీస్వామి నారాయణ గురుకుల్ ట్రస్టు ఇంటర్నేషనల్ ప్రధాన స్వామిజీ మహంతు సాధు దేవప్రసాద్ దాసు స్వామి, శిష్య బృందంతో కలిసి దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ట్రస్టు నిర్వాహకులు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తిరుపతి జిల్లా శ్రీకాళహస్తి, పులివెందుల, విశాఖపట్టణంలో తమ ఇంటర్నేషనల్ పాఠశాలల ఏర్పాటుకు స్థలాలకు సంబంధించి జీఓలను విడుదల చేశారన్నారు. త్వరలోనే సీఎం చేతుల మీదుగా పనులు ప్రారంభిస్తామన్నారు. వారితో ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలు

ఏర్పేడు: మండలంలోని సీతారాంపేట సమీపంలో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరికి గాయాలైనట్లు ఏర్పేడు సీఐ శ్రీహరి తెలిపారు. సీఐ వివరాల మేరకు.. తిరుపతికి చెందిన సుబ్రమణ్యం(49), మునస్వామి(36) ద్విచక్ర వాహనంపై శ్రీకాళహస్తికి వెళుతుండగా సీతారాంపేట సమీపంలో ఎదురుగా వస్తున్న కారును తప్పించబోయి అదుపు తప్పి కిందపడ్డారు. ఈ ప్రమాదంలో ఇద్దరికి గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం 108 వాహనంలో శ్రీకాళహస్తి ఏరియా ఆస్పత్రికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

ఇంటి ముంగిటకే ప్రభుత్వ పథకాలు

- ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

ఏర్పేడు: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అమలు చేస్తున్న ప్రభుత్వ సంక్షేమ పథకాలు పేదల ఇళ్ల వద్దకే చేరుతున్నట్లు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అన్నారు. మండలంలోని రావిళ్లవారి కండ్రిగ సచివాలయ పరిధిలో ఉన్న పెన్నగడం, ఎస్సీ కాలనీ, నార్లవారికండ్రిగ, కొత్తకాల్వ, ఎస్టీకాలనీలో ఆదివారం సాయంత్రం గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమం నిర్వహించారు. గ్రామాల్లోని 350 కుటుంబాలను కలిశారు. ఇంటింటికి వెళ్లి సంక్షేమ పథకాల గురించి వివరించారు. నాలుగున్నరేళ్లలో ప్రభుత్వం నుంచి పొందిన లబ్ధిపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. పెన్నగడం, ఎస్సీ కాలనీ, నార్లవారికండ్రిగ, కొత్త కాల్వ, ఎస్టీకాలనీలలో ఇళ్ల స్థలాలు, పక్కా గృహాలు, మురుగునీటి కాల్వల నిర్మాణాలు, విద్యుత్ సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే దృష్టికి తీసుకొచ్చారు. సమస్యలను పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. కుల, మత, రాజకీయాలకు అతీతంగా అర్హులైన ప్రతి ఒక్కరికి సంక్షేమ పథకాలు అందుతున్నట్లు వివరించారు. సీఎం జగనన్న మహిళా సంక్షేమానికి నిరంతర కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న జగనన్న సురక్షతో పేదలకు లబ్ధి చేకూరుతున్నట్లు చెప్పారు. వివిధ పనుల కోసం ప్రజలు ప్రభుత్వ కార్యాలయాల చుట్టూ తిరిగే పని లేకుండా సచివాలయ, వలంటీర్ల వ్యవస్థను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి శ్రీకారం



పెన్నగడంలో వృద్ధురాలితో ఆప్యాయంగా మాట్లాడుతున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

చుట్టారన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలు అర్హులందరికీ చేరుతున్నాయా లేదా.. ప్రజలకు అవసరమైన వాటి గురించి తెలుసుకోవడమే గడపగడపకు మన ప్రభుత్వం ఉద్దేశమన్నారు. గత ప్రజాప్రతినిధులు ఎన్నికల సమయంలో ప్రజల వద్దకు వెళ్లేవారన్నారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎమ్మెల్యేలు నిరంతరం ప్రజల మధ్యలో ఉంటూ వారి సమస్యలను పరిష్కరిస్తున్నట్లు వెల్లడించారు. నిరంతరం పేదల అభివృద్ధికి కృషి చేస్తున్న ప్రభుత్వంపై ప్రతిపక్షం బురదజల్లే ప్రయత్నం చేస్తున్నట్లు చెప్పారు. రాబోయే ఎన్నికల్లో ప్రజలు టీడీపీని భూస్థాపితం చేస్తారన్నారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యుడు తిరుమలయ్య, ఎంపీపీ గీత, సర్పంచ్‌ల సంఘం మండల అధ్యక్షుడు నల్లపాలెం శివయ్య, వైస్ ఎంపీపీలు జనార్ధన్‌రెడ్డి, శ్రీనివాసులు, కో–ఆప్షన్ సభ్యుడు బత్తిశెట్టి, వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జ్ గున్నేరి కిషోర్‌రెడ్డి, పార్టీ మండల అధ్యక్షుడు గురవారెడ్డి, ఉపాధ్యక్షుడు రాజారెడ్డి, సర్పంచ్ ప్రవంతి, మాజీ సర్పంచ్ తంబా సుబ్రమణ్యం, నాయకులు పెన్నగడం శ్రీధర్, యుగంధర్, రమేష్‌రెడ్డి, హరి, ఎస్ఎస్ చంద్ర, కుమార స్వామి, చెంగల్రాయులు, బాలముని, మునికుమార్, సుధీర్‌కుమార్, కుమార్‌రెడ్డి, కుప్పాల వెంకటేష్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామ సచివాలయ నిధులతో అభివృద్ధి పనులు



పల్లమాలకండ్రిగలో సీసీ రోడ్డు నిర్మాణం

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని పల్లమాల పంచాయతీలో గ్రామ సచివాలయ నిధులతో కేటీ రోడ్డు నుంచి పల్లమాలకండ్రిగ గ్రామానికి సీసీ రోడ్డు పనులు శరవేగంగా జరుగుతున్నాయి. సర్పంచ్ జొన్నల రమణమ్మ, వైఎస్సార్‌సీపీ నేత గోపాల్ రెడ్డి, పీఆర్ ఏఈ నాగరాజు పనులను పర్యవేక్షిస్తున్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పల్లమాల గ్రామ సచివాలయానికి రూ. 20 లక్షలు మంజూరు చేశారు. ఈ నిధులతో పల్లమాల కండ్రిగ గ్రామంలో రూ. 5 లక్షలతో సిమెంట్ రోడ్డు నిర్మాణ పనులు చేపట్టారు. దీనిపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు.

వేడుకగా అంకాలమ్మ జాతర



అమ్మవారి సేవలో అంజూరు తారక శ్రీనివాసులు

శ్రీకాళహస్తి: పట్టణంలోని పీవీరోడ్డులో వెలసిన శ్రీఅంకాలమ్మ అమ్మవారికి ఆదివారం జాతర నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు తీర్చుకున్నారు. కమిటీ సభ్యులు వారికి తీర్థప్రసాదాలు అందజేశారు. అమ్మవారిని శ్రీకాళహస్తీశ్వరాలయ పాలకమండలి చైర్మన్ అంజూరు తారక శ్రీనివాసులు దర్శించుకున్నారు. కార్యక్రమంలో స్వర్ణమూర్తి, హరినాథ్‌నాయుడు, ఫాజిల్, యతిరాజులు, బాలగౌడ్, అంకాలమ్మ కమిటీ సభ్యులు గోవర్ధన్, మురళి పాల్గొన్నారు.

ఇంటి పట్టాల పంపిణీ



ఇంటి పట్టాలను పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి

శ్రీకాళహస్తి: పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో ఆదివారం ఇంటి పట్టాల పంపిణీ కార్యక్రమం జరిగింది. ఎన్నికల సమయంలో శ్రీకాళహస్తి మండలం గోవిందరావుపల్లి, ఆంజనేయపురం, మాధవగిరి గ్రామాలకు చెందిన ప్రజలు తమకు ఇంటి పట్టాలు మంజూరు చేయాలని ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డిని కోరారు. టీడీపీ నాయకులకు పలుమార్లు మొరపెట్టుకున్నా వారు స్పందించలేదని ఎమ్మెల్యే వద్ద వాపోయారు. స్పందించిన ఆయన తాను ఎమ్మెల్యేగా గెలిచిన తరువాత ఇంటి పట్టాలను అందజేస్తానని హామీ ఇచ్చారు. ఇచ్చిన మాట ప్రకారం ఆదివారం పార్టీ కార్యాలయంలో ఎంపీ గురుమూర్తితో కలిసి 79 మందికి ఇంటి పట్టాలను అందజేశారు. దీంతో లబ్ధిదారులు ఆనందం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో నాయకులు ఓడూరు గిరిధర్‌రెడ్డి, కోటి, సుబ్బరాయలు, చంద్రయ్య, గురవయ్య, చెలికం నాగరాజు రెడ్డి, వెంగయ్య, గోరా, కోళ్లూరు హరినాయుడు, పరశురామ్ తదితరులు పాల్గొన్నారు.

అంధకారంలో సాతంబేడు

- 3 రోజులుగా ఆగిన విద్యుత్ సరఫరా
- అధిక సర్వీసులతో కాలిపోతున్న ట్రాన్స్‌ఫార్మర్లు



మరమ్మతులకు గురైన సింగిల్ ఫేస్ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్

వరదయ్యపాళెం: మండలంలోని సాతంబేడు గ్రామానికి 3 రోజులుగా విద్యుత్ సరఫరా ఆగిపోవడంతో ఆ గ్రామం అంధకారంలో ఉంది. గ్రామంలో 150కిపైగా ఇళ్లు ఉన్నాయి. అందుకు తగిన విధంగా ట్రాన్స్‌ఫార్మర్లను విద్యుత్‌శాఖ అధికారులు ఏర్పాటు చేయకపోవడంతో ఉన్న ఒక్క విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ అధిక లోడ్ కారణంగా మరమ్మతులకు గురవుతోంది. తాజాగా 3 రోజుల క్రితం ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోవడంతో శనివారం రాత్రి మరో ట్రాన్స్‌ఫార్మర్‌ను విద్యుత్‌శాఖ అధికారులు అమర్చారు. అయితే ఆదివారం తెల్లవారుజామున నూతనంగా అమర్చిన ట్రాన్స్‌ఫార్మర్ కాలిపోయింది. దీంతో 3 రోజులుగా విద్యుత్ సరఫరా లేక అటు తాగునీటి అవసరాలకు, ఇతర అవసరాలకు ఇబ్బందులు పడుతున్నట్లు స్థానికులు వాపోతున్నారు. విద్యుత్‌శాఖ ఉన్నతాధికారులు స్పందించి అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేయాలని కోరుతున్నారు. నాగలాపురం విద్యుత్‌శాఖ ఏడీఈను సాతంబేడు సమస్య గురించి వివరణ కోరగా.. గ్రామంలో 150 ఇళ్లు ఉన్నప్పటికీ విద్యుత్ మీటరు అమర్చుకున్న వారు 50లోపే ఉన్నారన్నారు. దీని కారణంగా అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ను అమర్చలేకున్నామని తెలిపారు. 200 యూనిట్లలోపు ఉచిత విద్యుత్ కాబట్టి సాతంబేడు దళితవాడలో గ్రామస్తులు సహకరించి ప్రతి ఇంటికి విద్యుత్ మీటర్లు అమర్చుకుంటే తక్షణమే అదనపు ట్రాన్స్‌ఫార్మర్‌ను ఏర్పాటు చేస్తామని తెలిపారు.

సాంకేతికతతో వ్యవసాయం లాభదాయకం



మాట్లాడుతున్న ఆత్మ డీడీ రత్నప్రసాద్

రేణిగుంట: ఆధునిక సాంకేతిక వినియోగం ద్వారా వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చవచ్చని చిత్తూరు ఆత్మ డిప్యూటీ డైరెక్టర్ రత్నప్రసాద్ అన్నారు. మండలంలోని కరకంబాడి పంచాయతీ వనస్థలిలో ఆదివారం ఐసీఏఆర్ 95వ వ్యవస్థాపక దినోత్సవాలు ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు రైతులకు విజ్ఞానాన్ని అందించే ఈ కార్యక్రమ ప్రారంభ సభలో ఆయన మాట్లాడారు. వ్యవసాయాన్ని లాభసాటిగా మార్చేందుకు యాంత్రికీకరణ, నూతన సాంకేతికతకు అనుగుణంగా పురోభివృద్ధి చెందుతోందన్నారు. వ్యవసాయంలో డ్రోన్ సాంకేతికత, డ్రమ్ సీడర్ పద్ధతిలో నేరుగా వరివిత్తనం నాటే విధానం గురించి వివరించారు. సేంద్రియ వ్యవసాయ ప్రాముఖ్యతను తెలియజేశారు. రైతులకు కృషి విజ్ఞాన కేంద్రం ద్వారా అందుతున్న సేవలను ప్రశంసించారు. భూసార పరీక్షలు, వానపాము ఎరువుల తయారీ, వర్షపు నీటి నిల్వ పద్ధతులు, ప్రత్యామ్నాయ పంటల సాగు, మేఘదూత్ మొబైల్ అప్లికేషన్ల గురించి వివరించారు. అనంతరం ప్రదర్శన క్షేత్రాల నిమిత్తం రైతులకు ఇన్‌పుట్స్ పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాస్ కేవీకే ప్రధాన శాస్త్రవేత్త, తిరుపతి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ప్రధాన శాస్త్రవేత్త కృష్ణారెడ్డి, ప్రతిమ, ఉద్యాన అధికారి పుష్పలత, డాట్ సెంటర్ సమన్వయకర్త రెడ్డిరాము, కేవీకే శాస్త్రవేత్తలు శ్రీలత, పద్మజ, సుధాకర్, దివ్య, రాముకుమార్, అనూష తదితరుల పాల్గొన్నారు.

మేనమామ సాంగ్యం బహూకరణ



ముస్లిం వధూవరులకు మేనమామ సాంగ్యం అందిస్తున్న బియ్యపు పవిత్రారెడ్డి

రేణిగుంట: రేణిగుంట బుగ్గవీధిలో ముస్లిం వధువుకు ఎమ్మెల్యే బియ్యపు మధుసూదన్‌రెడ్డి అందజేసిన మేనమామ సాంగ్యాన్ని వైఎస్సార్‌సీపీ మండల ఇన్‌చార్జి బియ్యపు పవిత్రారెడ్డి ఆదివారం అందజేశారు. రేణిగుంట షాదీమహల్‌లో జరిగిన వివాహ వేడుకలో పాల్గొన్న ఆమె వధువుకు మేనమామ సాంగ్యంగా డబుల్‌కాట్ మంచం, బెడ్, బీరువాను అందజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ నగేషం, వైస్ ఎంపీపీ సుజాత, ఎంపీటీసీ సభ్యుడు ఫైజున్నీసా బేగం, పార్టీ పట్టణ అధ్యక్షుడు ప్రభాకర్, పట్టణ ఉపాధ్యక్షుడు షబ్బీర్ అహ్మద్, షాదీమహల్ డైరెక్టర్ మస్తాన్, మాబా తదితరులు పాల్గొన్నారు.